ఘనంగా నేతాజీ జయంతి



సుభాష్‌నగర్ ఆటోస్టాండ్‌లో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు..



దూలపల్లి దుర్గా వెల్ఫేర్ సొసైటీలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు..

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి (పరాక్రం దివస్) వేడుకలను సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాజకీయ పక్షాలు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చేందుకు నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటీషర్ల గుండెల్లో దడ పుట్టించారని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. -రంగారెడ్డినగర్



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకల్లో చిన్నారులు, కరస్పాండెంట్ వెంకటేష్‌ముదిరాజ్



కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కంటి వెలుగుకు విశేష స్పందన

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కంటి వెలుగుకు విశేష స్పందన లభిస్తోంది. సోమవారం నియోజకవర్గంలోని 15 సెంటర్లలో 1762 మందికి కళ్ల పరీక్షలు నిర్వహించి 893 మంది కళ్లద్దాలు పంపిణీ చేశారు.

- గాజులరామారం సర్కిల్ పరిధిలోని ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాలు, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపం, భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు, సూరారం అంబేడ్కర్‌భవన్ సెంటర్లలో 534 మందికి పరీక్షలు చేయగా 291 మంది కళ్లద్దాలు అందజేశారు.
- కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాలు, సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ కమిటీ హాలు, బస్తీ దవాఖానా, పద్మానగర్ కమ్యూనిటీ హాలు , దుర్గా ఎస్టేట్స్ కమిటీ హాలు సెంటర్లలో 681 మందికి పరీక్షలు చేయగా 389 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.
- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలో 547 మందిని పరీక్షించి 213 మందికి కళ్లద్దాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నాగులూరులో కళ్లద్దాలు అందజేస్తున్న కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి

దుండిగల్: కంటి వెలుగును కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి నాగులూరు 2వ వార్డులోని కంటి వెలుగు సెంటర్‌ను ఆయన వార్డు కౌన్సిలర్ అమరం గోపాల్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్లద్దాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ... కళ్ల సమస్యలతో బాధ పడుతున్న పేద ప్రజలకు కంటి వెలుగు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన చికిత్సలు అందిస్తోందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రజలు శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు కొనసాగే సెంటర్లకు ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరాజు, ఇంజినీర్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

చౌరస్తా.. ఫ్రీ లెఫ్ట్ ప్రమాదకరంగా!



సుచిత్ర చౌరస్తాలో అడ్డదిడ్డంగా వెళ్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: సుచిత్ర చౌరస్తా వద్ద ఉన్న ఫ్రీ లెఫ్ట్ ప్రమాదకరంగా మారుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో అక్కడ ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం సమయంలో అక్కడ ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు రోడ్డుకు అడ్డంగా రాంగ్ రూట్లో వెళ్లడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామం నుంచి వచ్చే వాహనాలు చెన్నై షాపింగ్ మాల్ ముందు ఉన్న యూటర్న్ వద్ద తిరిగి బోయిన్పల్లి ,అల్వాల్ వైపు వెళ్లాలి. కానీ ద్విచక్ర వాహనాలు అడ్డదారుల్లో వెళ్లే ప్రయత్నం చేస్తూ ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందికరంగా మారుతున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో ఇక్కడ సంఘటనలు చోటుచేసుకున్న వాహనదారులు మార్పు రావడం లేదు. మధ్యాహ్న సమయంలో సైతం ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గందరగోళంగా జీవో.59 రిజిస్ట్రేషన్లు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో.59 రిజిస్ట్రేషన్‌లు గందరగోళంగా మారాయని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. జీవో.59తో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదల ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం సదుద్దేశంతో తీసుకువచ్చిన జీవో.59లో క్లారిటీ లోపించిందన్నారు. 2014 ప్రభుత్వ భూ లెక్కల ప్రకారం 25శాతం చెల్లిస్తే సరిపోతుందని జీవోలో ఉందన్నారు. కాని డిమాండ్ నోటీసుల్లో మాత్రంలో లక్షల్లో చెల్లించాలని వస్తోందని వాపోయారు. ఈ విషయమై అధికారులను అడిగితే తమ చేతుల్లో ఏమీ లేదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కలుగజేసుకుని పేదలకు న్యాయం చేయాలని వినతిలో కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు యాదయ్య, శివకుమార్ తదతరులు ఉన్నారు.

యోగాసనాలు, సూర్య నమస్కారాలతో ఆరోగ్యం



యోగాసనాలు నేర్పుతున్న యోగా మాస్టర్ రవీందర్‌రాజు

సుభాష్‌నగర్: నేటి ఉరుగులు పరుగుల జీవితంలో చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని యోగా గురువు కె.రవీందర్‌రాజు అన్నారు. ఈనెల 28న రథసప్తమి పురస్కరించుకుని శివోహం యోగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో జీడిమెట్ల విలేజ్‌లోని సరోజినీదేవి గార్డెన్‌లో సోమవారం ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఉచిత యోగా శిబిరానికి మొదటి రోజు మంచి స్పందన వచ్చిందని యోగ గురువు అన్నారు. ఆరు రోజుల పాటు జరగనున్న ఉచిత యోగ శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణయామాలను నేర్పించిన వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ జేఎన్ఎన్‌యూఆర్ఎం, 11 కేవీ కోకకోలా ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంబిటాస్ స్కూల్, డాలర్ మీడోస్, అమర్ దాబా, బావర్చి హోటల్, ఎస్‌బీఐ కాలనీ, సింహపురి కాలనీ, నెక్టస్ విల్లాస్, గోకుల్ విల్లాస్, లహరి ఎస్టేట్స్, విజ్ఞానజ్యోతి హాస్టల్, క్రీక్ స్కూల్, భౌరంపేట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం, భౌరంపేట్ 60 గజాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ధోలారీధనీ, కొంపల్లి, అపర్ణ, వెన్‌సాయి, నూజివీడు, జయభేరి, ఎస్‌సీఎల్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హెచ్‌ఎంటీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



హెచ్‌ఎంటీ చైర్మన్ పంకజ్‌గుప్తాను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్, యూనియన్ లీడర్లు

కుత్బుల్లాపూర్: హెచ్‌ఎంటీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం బెంగళూరులో ఆయన హెచ్‌ఎంటీ చైర్మన్ పంకజ్‌గుప్తాతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... హెచ్‌ఎంటీ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కంపెనీలో ప్రొడక్షన్‌కు అవసరమయ్యే వర్కింగ్ క్యాపిటల్‌ను కేటాయించడంతో పాటు కొత్త నియామకాలపై ప్రత్యేక చొరవ చూపి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

- పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు 5 సంవత్సరాల నుంచి పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, సెటిల్‌మెంట్ అలవెన్స్‌లను నిలిపివేయడంతో రిటైర్డ్ ఉద్యోగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జీఎం సుబ్రమణ్యం, యూనియన్ లీడర్లు విజయ్ కుమార్ (బెంగళూరు), సత్యనారాయణగౌడ్, రవీందర్, శ్రీనివాస్‌నాయక్ (హైదరాబాద్) తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలోని శ్రీముత్యాలమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు, గణపతిపూజ, శ్రీశివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అమ్మవారిని దర్శించుకుని అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవంలో మల్లేష్,సిద్ధరాములు, మాధవరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, చక్రి, కనకరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం



సోమయ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్యనగర్‌లో పాదయాత్ర చేపట్టిన కార్పొరేటర్‌కు రోడ్డు నం.16లో నెలకొన్న సీసీ రోడ్డు, తాగునీటి సమస్యలను స్థానికులు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బస్తీ ప్రెసిడెంట్ యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు సంపత్‌రెడ్డి, ఉదయ్, శాంతమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 22న మధ్యాహ్నం బహదూర్‌పల్లి చౌరస్తాలో రోడ్డు దాటుతున్న వ్యక్తి(35)ని గండిమైసమ్మ నుంచి సూరారం వైపు ఐరన్ లోడుతో వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యక్తి రెండు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా సదరు వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ శ్మశానవాటికలో పైపులైన్ పనులు



నిజాంపేట్ ఎస్సీ శ్మశానవాటికలో పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న మేకల నగేష్

నిజంపేట్: నిజాంపేట్‌లోని ఎస్సీ శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచే దిశగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే పర్యటించిన నేపథ్యంలో శ్మశానవాటికలో డ్రైనేజీ, షెడ్డుతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని దళిత రత్న మేకల నగేష్ కోరగా రూ.20 లక్షల నిధులు కేటాయించారు. సోమవారం శ్మశానవాటికలో జరుగుతున్న డ్రైనేజీ పనులను మేకల నగేష్ పర్యవేక్షించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.

లాభాపేక్ష లేకుండా కరాటేలో శిక్షణ



కరాటేలో మెలకువలపై శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: కరాటేలో తనదైన శైలిలో నైపుణ్యాన్ని ప్రదర్శించే విధంగా చిన్నారులు, యువకులను తీర్చిదిద్ది రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని కరాటే మాస్టర్ కృష్ణ అన్నారు. కృష్ణ బూమ్స్ స్పోర్ట్స్ అకాడమీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు చిన్నారులకు మెలకువలు నేర్పించే ఉద్దేశంతో గాజులరామారంలో సోమవారం స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసి పిల్లలకు కరాటే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కొంతమంది పిల్లలు కరాటే నేర్చుకుని ఇతరులపై ప్రయోగం చేస్తారని,అది కరాటేకు పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు. కొత్త కొత్త మెలకువలు నేర్చుకునేందుకు పిల్లలు పెద్ద ఎత్తున స్పోర్ట్స్ అకాడమీకి వస్తున్నారని పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రతి ఒక్కరికి తనకు తెలిసిన విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్నానని కృష్ణ పేర్కొన్నారు.

ప్రజావాణికి 77 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు అధిక ప్రాధాన్యతనిస్తూ.. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో జిల్లా నుంచి వచ్చిన ప్రజలకు సంబంధించి 77 అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో ఆయన కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో ఇప్పటి వరకు పరిష్కారం కాని అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

భిక్షాటన చేస్తున్న పిల్లల తండ్రికి కౌన్సెలింగ్



పూల వ్యాపారి బాషాకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై సంధ్య

నిజాంపేట్: స్కూల్‌కు వెళ్లకుండా భిక్షాటన చేస్తున్న ఇద్దరు చిన్నారుల తండ్రికి బాచుపల్లి కౌన్సెలింగ్ ఇచ్చి పాఠశాలలో చేర్పించారు. వివరాల్లోకి వెళితే.. సోమవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న ఎస్సై సంధ్యకు బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని భిక్షాటన చేస్తున్న ఆయన్(09), సాబీర్ (07) కనిపించారు. వారిని వాకబు చేయగా బీవీఆర్ఐటీ కళాశాల ఎదుట తమ తండ్రి ఎస్‌కే బాషా పూలు విక్రయిస్తాడని పేర్కొన్నారు. దీంతో ఎస్సై ఇద్దరు బాలూరును తండ్రి వద్దకు తీసుకువెళ్లి వారిని చదివించాల్సిందిగా కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు ఒప్పించి స్థానికంగా ఉన్న విశ్వభారతి పాఠశాలలో చేర్పించారు.

భక్తులకు హాని కలగకుండా చూస్తా..







గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర నాల్గో రోజుకు చేరుకుంది. సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. సాయంత్రం పోతరాజుల విన్యాసం చూపరులను ఆకట్టుకుంది. రాజీవ్‌గాంధీనగర్ చెందిన రాజేష్ (రంగం) అమ్మవారి భవిష్యవాణిని వినిపించారు. ఈ ఏటా వర్షాలు విస్తారంగా పడి పంటలు బాగా పండుతాయి అని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి హాని కలగకుండా చూస్తానని అమ్మవారు భవిష్యవాణిలో తెలిపారు. జాతరలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. – సుభాష్‌నగర్



క్లుప్తంగా

నేటి నుంచి సమన్వయ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 24, 25 తేదీల్లో సమన్వయ్ నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆర్తీ సంపతి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమన్వయ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో వివిధ కళాశాలకు చెందిన 2వేల మంది విద్యార్థులు పాల్గొంటారని, శ్రేష్ఠ ది యంగ్ మేనేజర్ ఈవెంట్‌లో విజేతకు ఎలక్ట్రిక్‌బైక్‌ను బహుమతిగా అందజేస్తామని పేర్కొన్నారు. అదే విధంగా అన్ని ఈవెంట్లలో గెలుపొందిన కళాశాలకు సత్రాజ్ ఆఫ్ సమన్వయ్ ట్రోఫీని అందజేయనున్నారు. ఈ ఫెస్ట్‌కు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ పీపుల్ డెవలప్‌మెంట్ హెడ్ వెంకట్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారుని నిర్వాహకులు తెలిపారు.

షిర్డీహిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీహెచ్ దాసు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీహిల్స్ శ్రీసాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీహెచ్ దాసు గెలుపొందారు. మొత్తం 560 ఓట్లు పోలవ్వగా 6 ఓట్ల స్వల్ప మెజారిటీతో అధ్యక్ష పదవి కైవసం చేసుకున్నారు. జనరల్ సెక్రటరీగా చంద్రశేఖర్, ట్రెజరర్‌గా శేషు విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో గెలిపించిన బస్తీవాసులకు రుణపడి ఉంటామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా ప్రయత్నిస్తామని తెలిపారు.

దుర్గా వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ

సుభాష్‌నగర్: దూలపల్లిలోని దుర్గా వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. 30 సంవత్సరాలుగా వీకర్స్ కాలనీగా పేరొందిన ప్రాంతాన్ని దుర్గ వెల్ఫేర్ సొసైటీగా మార్పు చేశారు. అధ్యక్షుడిగా పూజారి మహేష్, ఉపాధ్యక్షులుగా బోగారం రాజు, సీహెచ్ అశోక్, ప్రధాన కార్యదర్శులుగా కుమ్మరి శ్రీను, దుర్గం కుమార్, సంయుక్త కార్యదర్శిగా బోయదొడ్డి నారాయణ, సెక్రటరీగా జాదవ్ రామారావు, కోశాధికారిగా మస్కురి కృష్ణకాంత్, సలహాదారులుగా గ్యాంగ్యా నాయక్, బైరి శివకుమార్, గరిసె సతీష్, సభ్యులుగా బర్మ శ్రీధర్, అప్పారావు, సుధాకర్‌రెడ్డి, సుధాకర్, సాధు శ్రీను, చక్రాల సుధాకర్, బహబూబ్ అలీ, విఠల్‌రెడ్డిలు ఎన్నుకున్నారు.

యూత్ సభ్యుల నియామకం..

యూత్ ప్రెసిడెంట్‌గా దేవి శివాజీ, వైస్ ప్రెసిడెంట్‌లు జోగుల నర్సింహ, ఫణికుమార్, అక్రమ్, జనరక సెక్రటరీలుగా నాయకోటి కిరణ్, చెలిమెల మధు, సెక్రటరీగా మల్లికార్జున్‌ముదిరాజ్, జాయింట్ సెక్రటరీ అభిరామ్‌గౌడ్, కోశాధికారిగా ఆకుల రాజేందర్, మెంబర్లుగా మహాదేవ్, నవనాథ్ పాటిల్, ఉచ్చుల వెంకటేష్, తలారి అర్జున్, జాజుల కిరణ్, బైరి రాజేష్‌లు నియమితులయ్యారు.

జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జీడిమెట్ల: జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పాత పాలకవర్గం గడువు ముగియడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జీ.రంగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.సాయికిషోర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, కోశాధికారిగా ఎం.దుర్గయ్యగౌడ్, ఎంసీ మెంబర్లుగా వి.సుబ్బారావు, వి.శ్రీనివాస్‌రావు, వి.శ్రీనివాసులు, కరుణ్, కాశీ విశ్వనాథ్‌రాజ్, సౌమ్య, కిషోర్ పటేల్, కె.శ్రీనివాస్‌రెడ్డిలు నియమితులయ్యారు. అసోసియేషన్ ఎన్నికల అధికారిగా కృష్ణప్రసాద్ వ్యవహరించి పరిశ్రమల ప్రతినిధులు ప్రతిపాదించిన పేర్లను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఆదినారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు కుల సంఘం అధ్యక్షుడిగా రాధాకృష్ణరాజు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ భట్రాజు కుల సంఘం అధ్యక్షుడిగా తంగేళ్ల రాధాకృష్ణరాజు నియమితులయ్యారు. సోమవారం సూరారంలోని ఉమామహేశ్వర ఆలయ హాలులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి కరుణాకర్‌రాజు ఎన్నికల అధికారిగా, ప్రధాన కార్యదర్శి భట్టు కృష్ణంరాజు పరిశీలకుడిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా సరికొండ పాపరాజు, ఉపాధ్యక్షులుగా సరికొండ శ్రీనివాస్‌రాజు, వెంగల్‌రాజు, శ్రీనివాసరాజు, వీణ వీరంరాజు, ఉడుముడి రాఘవరాజు, కోశాధికారిగా మహాశివబట్టు గోపాలకృష్ణంరాజు, కార్యదర్శులుగా సరస్వతి అశోక్‌రాజు, బాహాటం కృష్ణార్జునరాజు, ఏనుగదాటి పరమేశ్వరి, మొగసాటి సుధీర్ కుమార్‌రాజు, ప్రచార కార్యదర్శిగా కూరపాటి శ్రీరామరాజు, మీడియా కార్యదర్శిగా భట్టు ప్రవీణ్‌రాజు, కార్యవర్గ సభ్యులుగా వేమరాజు శేషంరాజు, దశరథ దురందర్‌రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, కార్యదర్శి పాపరాజులు మాట్లాడుతూ.. భట్రాజు కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా పటిష్ట పరిచేందుకు శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు.